సాక్షి
నిజామాబాద్
సోమవారం : 20 : మార్చి : 2023



ముగిసిన బ్రహ్మోత్సవాలు
నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమలలో ఏడు రోజుల పాటు జరిగిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగి
- 8లో ▸



కెపాసిటర్లు బిగించాలి..
వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని ఎన్పీడీసీఎల్ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.
- 10లో ▸

గరిష్టం/కనిష్టం
30.8 /18.7

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉండవచ్చు. చల్లటి గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం వాతావరణం చల్లబడు తుంది.

న్యూస్‌రీల్

ప్రీక్వార్టర్స్‌కు చేరిన నిఖత్



నిజామాబాద్ నాగారం : ఉమెన్ వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ ప్రీక్వార్టర్స్‌కు చేరింది. ఆదివారం ఢిల్లీలో జరిగిన బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అల్జీరియాకు చెందిన క్రీడాకారిణిని 0–5 తేడాతో ఓడించి నిఖత్ ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. సోమవారం జరిగే మ్యాచ్‌లో గెలిస్తే క్వార్టర్‌ఫైనల్స్ మ్యాచ్ చేరనుంది.

ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని అలవాటు చేసుకోవాలి




ఆర్మూర్‌టౌన్: ప్రతిఒక్కరూ తమ జీవన శైలిలో ధ్యానాన్ని అలవాటు చేసుకోవాలని ధ్యానం మాస్టర్ రహీం అన్నారు. ఆర్మూర్ పట్టణంలో మహా కరుణ మెగా శాఖాహార ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధ్యానం చేయడం వల్ల ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా పీఎస్ఎస్ఎం అధ్యక్షుడు నల్లాగంగారెడ్డి, ఆర్మూర్ పీఎస్ఎస్ఎం కమిటీ సభ్యులు సాయి, కృష్ణారెడ్డి, గంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి



డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఘన్‌పూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు ఆదివారం గ్రామంలోని గాంధీ విగ్రహం నుంచి డిచ్‌పల్లి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రైల్వే స్టేషన్‌కు అటువైపు ఘన్‌పూర్, ముల్లంగి గ్రామాలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్పత్రి, ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఉన్నాయన్నారు. దీంతో ఉద్యోగులు, విద్యార్థులు, ఆయా గ్రామాల ప్రజలు రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో పట్టాలు దాటుతూ వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం రైల్వేలైన్‌కు విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేశారని, రైళ్ల రాకపోకలు మరింత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. అనంతరం రైల్వేస్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

వచ్చేనెల బ్రాహ్మణ బ్రహ్మ గర్జన



నిజామాబాద్ సిటీ: బ్రాహ్మణుల సంక్షేమం, అభివృద్ధి, ఐక్యత కోసం ఏప్రిల్ 23న హైదరాబాద్‌లో బ్రాహ్మణ బ్రహ్మ గర్జన నిర్వహించనున్నట్లు తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెన్నంపల్లి జగన్ మోహన్‌శర్మ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోగల గీత భవనంలో ఆదివారం బ్రాహ్మణ బ్రహ్మ గర్జన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బ్రాహ్మణులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యల పరిష్కారం కోసమే బ్రహ్మ గర్జన నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్రాహ్మణ సోదర, సోదరిమణులు భారీగా తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. ఇందూర్ అధ్యక్షుడు కంజర్ల భూపతిరావు, న్యాయవాది గిరిధర్‌రావు, చంద్రశేఖరశర్మ, ప్రభాకర్ శర్మ, కిరణ్ దేశ్‌ముఖ్, రొట్టె సురేష్ శర్మ, మేడిచర్ల శ్రీనాద్, ఉమేష్ గాయత్రి, రచన ప్రవీణ్ కులకర్ణి పాల్గొన్నారు.

నందిపేట మండలం బజార్‌కొత్తూర్‌లో నేలకొరిగిన మొక్కజొన్న



అన్నదాత

కంటతడి

ఆరుగాలం కష్టపడి దేశానికి అన్నం పెట్టే రైతన్న ఎప్పటిలాగే ఈ సీజన్‌లోనూ ప్రకృతి ప్రకోపానికి గురయ్యాడు. జిల్లాలో గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా పలుచోట్ల వరి, మొక్కజొన్న, ఇతర పంటలు దెబ్బతిన్నాయి. వడగండ్ల వర్షంతో పలువురు రైతులు నష్టపోయారు.

- అకాల వర్షంతో రైతన్న కుదేలు
- దెబ్బతిన్న వరి, మొక్కజొన్న
- పంటనష్టం ప్రాథమిక అంచనాలు సేకరిస్తున్న అధికారులు
- సక్రమంగా అంచనా వేయడం లేదంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో సుమారు 1,700 ఎకరాల్లో వరిపంట 250 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మూడు మండలాల్లోని 13 గ్రామాల్లో ఈ పంటలు నష్టపోయినట్లు పేర్కొన్నారు. భీంగల్, ధర్పల్లి మండలాల్లో వరి, నందిపేట, ముప్కాల్, బాల్కొండ, మోస్రా ఎడపల్లి మండలాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. అయితే ఇతర మండలాల్లో కూడా ఇతర పంటలు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాల మేరకు ఈ వివరాలు చెప్పినప్పటికీ పూర్తిస్థాయిలో నష్టం గురించి సర్వే చేస్తే మరింత నష్టం జరిగినట్లు తెలుస్తుందని రైతులు చెబుతున్నారు. బోధన్ డివిజన్‌లో పొద్దుతిరుగుడు పంటకు కూడా నష్టం వాటిల్లడం గమనార్హం. సాలూర, బోధన్ మండలాల్లో ఖాజాపూర్, సాలూర క్యాంప్, జాడి జమాల్పూర్, కొప్పర్తి క్యాంప్, సాలంపాడ్, సాలంపాడ్ క్యాంప్ గ్రామాల్లో స్వల్ప విస్తీర్ణంలో పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి. కాగా పంట నష్టం లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతుండడం గమనార్హం. కాగా ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి వద్ద వడగండ్ల వర్షం కురిసింది. సుమారు 300 ఎకరాల్లో వరి పంటకు 30 శాతం మేర నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనాగా చెబుతున్నారు. మోస్రాలో కురిసిన వర్షంతో స్వల్ప విస్తీర్ణంలో వరి పంటకు నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

ధర్పల్లి మండలంలో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. దుబ్బాక, రేకులపల్లి గ్రామాల్లో వడగండ్ల కారణంగా వరి పంట దెబ్బతింది. వరి గింజలు రాలిపోయాయి. ధర్పల్లి మండలం రేకులపల్లి, భీంగల్ మండలం గోనుగొప్పుల, సికింద్రాపూర్ గ్రామాల్లో వడగండ్ల వర్షం ప్రభావం వరి పంటపై పడింది. దుబ్బాక, రేకులపల్లి గ్రామాల్లో 250 ఎకరాలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. 40 ఎకరాలో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు మాత్రం 30 శాతం లోపే నష్టం, స్వల్ప నష్టం అంటూ సక్రమంగా అంచనాలు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



దుబ్బాకలో నేలరాలిన మామిడి పంట



రేకులపల్లిలో రాలిపోయిన ధాన్యం




ఎడపల్లిలో వడగండ్లకు నష్టపోయిన పంటను పరిశీలిస్తున్న అధికారులు



నూత్‌పల్లిలో రాజరాజేశ్వర స్వామి ఆలయంలో విరిగిపోయిన ధ్వజస్తంభం

కొత్త పోలీస్‌బాస్ కోసం..

- ఈ నెలాఖరుకు పదవీ విరమణ పొందనున్న సీపీ నాగరాజు
- కొత్త కొత్వాల్ కోసం ప్రజాప్రతినిధుల్లో చర్చ
- పది రోజుల్లో కొత్త సీపీపై స్పష్టత?



ఖలీల్‌వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కోసం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు మల్లాగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. కేఆర్ నాగరాజు నిజామాబాద్ సీపీగా పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాదికిపైగా అవుతోంది. అయితే ఈ నెల ఆఖరున సీపీ నాగరాజు పదవీ విరమణ పొందనున్నారు. దీంతో కొత్త కొత్వాల్ ఎవరు వస్తారనే చర్చ నిజామాబాద్ జిల్లాలో జరుగుతుంది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కొత్త పోలీస్‌బాస్ కోసం అన్వేషణ చేస్తున్నట్లు తెలిసింది. వచ్చే పోలీస్ కమిషనర్ రెండు నుంచి మూడేళ్ల పాటు పదవీలో కొనసాగుతారు. దీంతో తమకు అనుకూలంగా ఉండే వారికోసం ప్రజాప్రతినిధులు సెర్చ్ చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. తొమ్మిది నెలల్లో శాసనసభ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా ఉండే పోలీసు అధికారి కోసం మల్లాగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో పోలీసు అధికారి సపోర్టు ఉండాలని ప్రజాప్రతినిధులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వారం, పది రోజుల్లో కొత్త సీపీ ఎవరు అనేది స్పష్టత వస్తుందని తెలుస్తోంది. జిల్లాకు డైరెక్ట్ ఐపీఎస్‌లు, కాంఫార్డ్ ఐపీఎస్ వస్తారనే ప్రచారం జరుగుతుంది. ఇందులో ఒక మహిళ ఐపీఎస్ పేరు వినిపిస్తోంది. సదరు మహిళ ఐపీఎస్ ఇక్కడ కొన్ని రోజుల పాటు ఏఎస్పీగా పనిచేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల కారణంగా సీపీ ఎంపిక కొంత ఆలస్యం జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇతర జిల్లాకు సంబంధించిన ఓ సీపీకి కొన్నిరోజుల పాటు తాత్కాలికంగా ఇన్‌చార్జి ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం ఉంది. సీపీ పదవీ విరమణ జరిగినా.. డీఐజీ పోస్టు సైతం ఖాళీగానే ఉంది. నిజామాబాద్‌కు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఇన్‌చార్జీగా ఉన్నారు.

కాంగ్రెసోళ్లు కాగితాల్లోనే ఇళ్లు కట్టారు

- సీఎం కేసీఆర్ లబ్ధి చేకూర్చారు
- ఎంపీ రైతులను మోసం చేశారు
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



డబుల్ బెడ్ రూం ఇంటి పట్టాను అందజేస్తున్న మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

భీమ్‌గల్ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కాగితాల మీదనే ఇళ్లు ఉండేవని, లబ్ధిదారుల పేరు మీద వచ్చిన డబ్బులను కాంగ్రెస్ నాయకులు జేబులో వేసుకునే వారని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం మండలంలోని బడా భీమ్‌గల్‌లో రూ. 7.77 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 112 డబుల్ బెడ్ రూం ఇళ్లను పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేముల మాట్లాడుతూ సొంతింటి కల నిజం చేయాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని, ఇలాంటి కార్యక్రమం దేశంలో ఎక్కడా లేదన్నారు. డబుల్ ఇళ్లు లేవని చెప్పిన రేవంత్‌రెడ్డి బడా భీమ్‌గల్ వచ్చి చూడాలన్నారు.

బాండ్‌పేపర్‌కు ఉన్న విలువ పోగొట్టారు

పసుపు బోర్డు పేరుతో రైతులకు బాండ్ పేపర్ రాసిచ్చి మోసం చేసి ఎంపీ అయిన అరవింద్ బాండ్ పేపర్‌కు ఉన్న విలువను పోగొట్టాడని ఎద్దేవా చేశారు. రైతుబంధును కాపీ కొట్టి కేంద్రం ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ సమ్మాన్ యోజన జిల్లాలో ఎంత మందికి వచ్చిందో సమాధానం చెప్పాలని ఎంపీ అరవింద్‌ను అడిగారు. రైతుబంధు కింద కేసీఆర్ ఎకరానికి రూ. 10 వే లు ఇస్తున్నారని, ఏటా లబ్ధిదారులు పెరుగుతున్నారని, పీఎం కిసాన్ యోజన లబ్ధిదారుల సంఖ్య తగ్గుతుందన్నారు. మోడీ పాలనతో నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు అరిగోస పడుతున్నారన్నారు. దేశ సంపదను తన కార్పోరెట్ మి త్రులకు కట్టబెడుతున్న మోడీని కేసీఆర్ ప్రశ్నిస్తున్నందునే, కేసీఆర్‌ను కట్టడి చేయాలని ఆయన బిడ్డ కవితను కేసుల పేరుతో వేధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బిల్డర్లతో అధికారుల కుమ్మక్కు

- టౌన్‌ప్లానింగ్ సిబ్బంది అక్రమాలు
- మార్ట్‌గేజ్ చేసిన ప్లాట్లను దర్జాగా అమ్మేసేందుకు సహకారం

నిజామాబాద్‌నాగారం : బల్దియాలోని టౌన్‌ప్లానింగ్‌లో అక్రమాలే ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నగరంలో వెలుస్తున్న పలు వెంచర్లలో లొసుగులను ఆసరాగా చేసుకుని లైసెన్స్ ఇంజినీర్లతో, బిల్డర్లతో, బ్యాంక్ వ్యాల్యువర్లతో కలిసి టౌన్‌ప్లానింగ్ అధికారులు అందినకాడికి దోచుకుంటున్నారు. ఫలితంగా పలు వెంచర్లలో అక్రమాలు జోరుగా సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం మార్ట్‌గేజ్ ఉన్న ప్లాట్లు అమ్మే అవకాశం లేదు. కాని అధికారుల సహకారంతో బిల్డర్లు దర్జాగా అమ్ముతున్నారు.

నగరంలోని చంద్రనగర్‌లో సుమారు ఐదెకరాల ఒక వెంచర్‌లో దరఖాస్తు నం.3146/ NIZAMABAD/2020/0922తో నవంబర్ 26న ఓ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కొన్ని నెలలుగా దరఖాస్తును టౌన్‌ప్లానింగ్ అధికారులు పెండింగ్‌లో పెట్టారు. మళ్లీ 2021 ఫిబ్రవరి 27న దరఖాస్తు పెటుకోవడంతో రిజెక్ట్ అయింది. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదిస్తే అప్పుడు పాత దరఖాస్తునే పేర్లు మార్చి 2021 జూలై 12న అనుమతిచ్చారు. ఇక్కడ విషయమేమిటంటే అప్పటికే అక్కడ ఇల్లు కట్టి ఉంది. దీంతో టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదించి పెద్ద ఎత్తున చేతిలో పెడితే వారు ఇల్లు కట్టి ఉన్నప్పటికీ ఇల్లు కట్టుకోవడానికి పర్మిషన్ ఇచ్చారు. అంతేకాకుండా బ్యాంక్ వాల్యూవర్లు, బిల్డర్లు, టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో కలిసి బ్యాంకులో ఆ ఇంటి పేపర్లు మార్ట్‌గేజ్ చేసి సుమారు రూ. 40 లక్షల వరకు రుణం ఇప్పించారు. ఇక్కడ బిల్డర్ రూ. 20 లక్షల వరకు లాభపడగా టౌన్ ప్లానింగ్ సిబ్బంది లాభపడగా బల్దియాకు ఆదాయం పోయింది.

■ వినాయక్‌నగర్‌లోని 51 ఎకరాల్లో తయారైన వెంచర్‌లో ఎల్‌పీ నం. 8 /97తో ఓపెన్ ప్లాట్లు చేశారు. ఇందులో సుమారు 20కి పైగా ప్లాట్లు మున్సిపాలిటీకి మార్ట్‌గేజ్ చేశారు. అంటే నిబంధనల ప్రకారం ఈ ప్లాట్లను ఎవరికీ అమ్మడం కొనడం చేయకూడదు. అయితే వెంచర్ యజమానులు నిబంధనలు తుంగలో తొక్కి సుమారు 15 ప్లాట్లు అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ఒక్కో ప్లాట్‌ను రూ. 10 లక్షలకు పైగా వసూలు చేశారు. దీనికి టౌన్‌ప్లానింగ్ అధికారులే ముందుండి అక్రమాలకు దారి చూపారు.

పర్యవేక్షణ లేకపాయే..

నగరంలోని మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వెంచర్లలో కనీస నిబంధనలు పాటించడం లేదు. నగరంలో సుమారుగా 250 వెంచర్లలో టౌన్‌ప్లానింగ్ అధికారులే పూర్తిగా సహకరించడంతో వెంచర్లలో ఉన్న మున్సిపాలిటీకి చెందిన 10 శాతం భూములు దర్జాగా అమ్మేస్తున్నారు.

'నిరసన'లో నిప్పులు

- ప్రశ్నపత్రాల లీకేజీలో పెద్దల పాత్రపై ఆరోపణలు
- జిల్లాలో రెండోరోజు కొనసాగిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర



గాంధారి మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర

సాక్షి, కామారెడ్డి : పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర జిల్లాలో ఆదివారం రెండో రోజు కొనసాగింది. గాంధారి మండలంలోని జువ్వాడి చౌరస్తా నుంచి గాంధారి వరకు పాదయాత్ర చేశారు. మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద ఉదయం 11 గంటలకు 'నిరుద్యోగ నిరసన దీక్ష' చేపట్టారు. సాయంత్రం 6 గంటల వరకు దీక్ష కొనసాగింది. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీలు రేవంత్‌రెడ్డికి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ప్రధానంగా ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పరీక్ష పత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ వైఫల్యాలపైనే ఎక్కువగా ఫోకస్ చేశారు. ప్రభుత్వ పెద్దల అండతోనే ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయని ఆరోపించారు. పరీక్షలు రద్దు చేయడం కాదని, కేసీఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేయడానికి నిరుద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

పారదర్శకతకు పాతరేశారు..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్ల తర్వాత ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వం.. పారదర్శకతను పాతరేసిందని పీసీసీ చీఫ్ ఆరోపించారు. ప్రశ్నాపత్రాలు లీకవడంలో పెద్దవాళ్ల అండ ఉందంటూ దుయ్యబట్టారు. ఉద్యోగాలు భర్తీ చేయడంలో విఫలమైన సీఎం కేసీఆర్.. ఉద్యోగాలు వచ్చే దాకా నిరుద్యోగ భృతి ఇస్తానన్న మాటనూ నిలుపుకోలేదన్నారు. తెలంగాణ వస్తేనే ఉద్యోగాలొస్తాయని ఎంతోమంది యువకులు, విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని.. ప్రత్యేక రాష్ట్రంలో అమరులు, ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేరకపోగా ఉద్యోగాలు అంగడి సరుకుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్పీఎస్సీలో ఏపీకి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు ఎలా ఉద్యోగం ఇచ్చారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈనెల 24, 25 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు చేపట్టే దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాలలో జరిగిన హాథ్‌సే హాథ్ జోడో పాదయాత్ర, గాంధారి మండల కేంద్రంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన దీక్ష విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, కాంగ్రెస్ సీనియర్ నాయకులు షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, అంజన్‌కుమార్ యాదవ్, బల్‌రాంనాయక్, సురేశ్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎల్లారెడ్డి అభ్యర్థిత్వం బాధ్యతను షబ్బీర్‌కు అప్పజెబుతున్నామన్నారు. నేడు సోమవారం బాన్సువాడ నియోజకవర్గంలో జోడోయాత్ర కొనసాగనుంది.

గోదారి గట్టున గంజాయి దందా..!

- పోచంపాడ్ ప్రాజెక్ట్ దిగువన గోదావరి గట్టుపై గంజాయి విక్రయం
- జోరుగా సాగుతున్న క్రయవిక్రయాలు
- పెద్దల హస్తముందనే అనుమానాలు

బాల్కొండ/మోర్తాడ్ : పవిత్ర గోదావరి గట్టును కూడా గంజాయి స్మగ్లర్లు వదలడం లేదు. గోదావరి గట్టునే అడ్డాగా చేసుకుని గంజాయి విక్రయిస్తున్నారు. తాజాగా రెండు రోజుల క్రితం గోదావరి గట్టున గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని ఆర్మూర్ ఎక్సైజ్ అధికారుల పట్టుకుని అరెస్ట్ చేసి వారి నుంచి 230 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రాజెక్ట్ అతిథిగృహం నుంచి ఉన్న రోడ్డు వెంట హెలిప్యాడ్ దాటిన తర్వాత చెట్లు దట్టంగా ఉన్నాయి. అటువైపు జన సంచారం ఉండదు. దానినే అదునుగా చేసుకుని గంజాయి దందాను నడిపిస్తున్నారు.

నిర్మల్ నుంచి సరఫరా

నిజామాబాద్, నిర్మల్ జిల్లాల సరిహద్దు ప్రాంతం గోదావరి. దీంతో నిర్మల్ జిల్లా నుంచి గంజాయిని పోచంపాడ్‌కు సులభంగా సరఫరా చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితులు కూడా నిర్మల్ నుంచే తీసుకొచ్చినట్లు విచారణలో తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి నిర్మల్ జిల్లాకు అక్కడి నుంచి నిజామాబాద్ జిల్లాకు తరలిస్తున్నారు.

పోచం'పాడ్' ఆగేదెలా..?

ఉత్తర తెలంగాణకు కల్పతరువుగా ఉన్న ప్రాజెక్ట్ ఉన్న ప్రాంతాన్ని పోచంపాడుగా పిలువడం బాలేదని పోచంపాడ్‌ను కాస్తా శ్రీరాంసాగర్‌గా మార్చారు. గతంలో ఈ ప్రాంతంలో మట్కా జోరుగా ఉండగా ప్రస్తుతం గంజాయికి అడ్డాగా మారడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



బాల్కొండలో గంజాయి విక్రయిస్తున్న వారి అరెస్ట్ చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

రాజకీయ ఒత్తిడితో..

గంజాయి ఇతర మత్తు పదార్థాలను నిరోధించడానికి నిర్దేశించిన ఎక్సైజ్ శాఖ ప్రేక్షక పాత్ర పోషిస్తుందనే విమర్శలు ఉన్నాయి. గంజాయి విక్రయాలపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని భావిస్తున్నా రాజకీయ ఒత్తిడి వల్ల వారు ఇరకాటంలో పడ్డారని వెల్లడవుతోంది. గంజాయి మత్తులో జోగుతున్న వారి నుంచి శాంతిభద్రతల సమస్య తలెత్తుతుంది. తాజాగా ఏర్గట్ల మండలం దోంచందలో ముగ్గురు వ్యక్తులు గంజాయి సేవించి ఒక వృద్ధురాలిపై దాడి చేశారు. కారును వేగంగా నడిపిస్తూ గ్రామంలో అలజడి సృష్టించారు. అలాగే వద్యాట్‌లో రెండు, మూడు రోజులకు ఒకసారి గొడవలకు దిగుతున్న యువకులు ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. గంజాయి విక్రయిస్తూ తమ పిల్లలను నాశనం చేస్తున్నారనే కారణంతో కొంత మంది ఒక వ్యక్తి ఇంటి వద్ద ఆందోళన చేయడం గమనార్హం. కమ్మర్‌పల్లి, తిమ్మాపూర్, తాళ్లరాంపూర్, ఏర్గట్ల, కోనసముందర్, శెట్‌పల్లి, తొర్తి, బట్టాపూర్, మోర్తాడ్, హాసకొత్తూర్ తదితర గ్రామాల్లో గంజాయి అమ్మ గంజాయి మత్తులో మునుగుతున్న యువకులు అనేక మంది ఉన్నారు.

పెద్దల హస్తం ఉందా..?

జిల్లాలో ఇప్పటికే అనేక కేసులు నమోదైనా గంజాయి స్మగ్లింగ్ ఆగకపోవడానికి పెద్దల హస్తం ఉండి ఉంటుందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బాల్కొండ, ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, బోధన్ నియోజకవర్గాల్లో గంజాయి దందా జోరుగా సాగుతోంది. ప్రత్యేకంగా ఆర్మూర్ పోలీసు డివిజన్ పరిధిలో గంజాయి వ్యాపారంపై ఉక్కు పాదం మోపడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మోర్తాడ్: మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి ప్రశాంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. బర్దంవాడలోని మొండివాగుపై వంతెన శిథిలావస్థకు చేరుకోగా కొత్త వంతెన నిర్మాణం కోసం రూ.2.2 కోట్లు మంజూరు చేశారు. రోడ్డు మరమ్మతులకు రూ.1.6 కోట్లు, కమ్మర్‌పల్లి నుంచి వద్యాట్‌కు వయా మోర్తాడ్ రోడ్డు కోసం రూ.45 లక్షలు, పెద్దమ్మ గుడి వద్ద కల్వర్టు నిర్మాణం కోసం రూ.15 లక్షలను మంజూరు చేయగా.. ఈ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భోగ ధరణి, ఎంపీటీసీ ఎలాల రాజ్‌పాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్న రాజేశ్వర్, నాయకులు జేసీ గంగారెడ్డి, ఎలాల భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు



మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లిలో గల ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఏడు రోజుల పాటు కనుల పండుగగా బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. మూలవిరాట్‌కు ఉత్సవ అనంతర స్నపన సేవతో వేద పండితులు బ్రహ్మోత్సవాలను ముగించారు. 108 కళశాల్లో అభిషక గంగను తీసుకొచ్చి స్వామివారికి అభిషేకం చేశారు. త్రిదండి దేవనాథ జీయరు స్వామివారి పర్యవేక్షణలో ఆచార్య గంగోత్రి రామానుజ దాస్ స్వామి వారి ఆశీస్సులతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణమయ్యాయని ఆలయ ధర్మకర్త నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆలయ ధర్మకర్తలు నర్సింహారెడ్డి దంపతులు, దిల్‌రాజ్ దంపతులు, విజయసింహారెడ్డి దంపతులు, సర్పంచ్ సాయిరెడ్డి, ఎంపీటీసీ రాములు, రవీందర్‌యాదవ్, నర్సారెడ్డి, నరాల సుధాకర్, లక్ష్మి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలి



నిజామాబాద్అర్బన్: గ్రూప్–1, ఇతర పరీక్షల పేపర్ లీకేజీలపై రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్‌సింగ్ అన్నారు. నగరంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న పరీక్షల్లో పారదర్శకత లోపించిందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే పరీక్ష ప్రశ్నాపత్రం బయటకు వెళ్లిందన్నారు. 'పేపర్ లీకేజీల'పై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తే మరిన్ని విషయలు బయటపడే అవకాశం ఉందన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు అజయ్, భాస్కర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అప్పుల బాధ!

- డబ్బు కట్టలేదని వస్తువులు తీసుకెళ్తున్న ఎన్‌డీసీసీ బ్యాంకు సిబ్బంది
- దీర్ఘకాలిక రుణాల చెల్లింపులో సామాన్య రైతులే బలి
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



రైతు ఇంటి నుంచి బైక్ తీసుకెళ్తున్న అధికారులు

నస్రుల్లాబాద్: లోన్ డబ్బులు కట్టడానికి రైతులు పడే అవస్థలు అన్నీ ఇన్నీ కావు. అప్పుల బాధతో అనేక మంది రైతులు తనువు చాలిస్తుంటే.. బ్యాంకు అధికారులు మాత్రం కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారు. తీసుకున్న రుణం కట్టలేదని రైతుల ఇంటి తలుపులు, ఇంట్లోని వస్తువులు తీసుకెళ్తున్నారు. ఇలాంటి ఘటనలు నస్రుల్లాబాద్ మండలంలో చోటుచేసుకుంటున్నాయి. రైతుల కోసం ప్రత్యేక రుణాలను అందించడానికి ఏర్పాటు చేసిన ప్రాథమిక సహకార సంఘం బ్యాంకులు సామాన్య రైతులను ఇబ్బందులు పెడుతున్నాయి. డబ్బులు లేని సమయంలో ఇంటి వస్తువులను తీసుకెళ్లి వాయిదా చెల్లిస్తేనే వస్తువులు ఇస్తామంటూ అధికారులు దౌర్జన్యం చేస్తున్నారు.

నస్రుల్లాబాద్ మండలంలోని సంగం, అంకోల్, అంకోల్ తండాలో రైతుల ఇళ్ల వద్దకు వెళ్లిన ఎన్‌డీసీసీ బ్యాంకు సిబ్బంది ఇంటి తలుపులను తొలగించి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేశారు. అందులో భాగంగా అంకోల్ గ్రామానికి చెందిన సుంచు హన్మండ్లు ఇంటిపై బ్యాంకు అధికారులు దాడి చేశారు. ఈ సారికి వదిలేస్తున్నాం మంగళవారం చెల్లించకుంటే బుధవారం వచ్చి తలుపులు తీసుకెళ్తామని బెదిరించి వెళ్లారు. హన్మండ్లు మాట్లాడుతూ తాను ఇంటి నిర్మాణం కోసం రూ.1.5లక్షలు తీసుకున్నానని, కానీ దానికి మరో రూ.4.50 లక్షలు చేర్చి రూ.ఆరు లక్షలు తీసుకున్నట్లు చెబుతున్నారని వాపోతున్నాడు. దీనికి వడ్డీతో కలిపి రూ.10.86 లక్షలు తక్షణమే చెల్లించాలంటూ తాను ఇంట్లో లేని సమయంలో ఇబ్బందికి గురి చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా మండలంలో మరో రైతు ఇంట్లో ల్యాప్‌టాప్‌ను, శ్రీనివాస్‌కు చెందిన బైకును తీసుకెళ్లగా కొంత డబ్బులు చెల్లించి వాటిని రైతులు తీసుకున్నారు.

సన్నకారు రైతులపైనే పెత్తనం

దీర్ఘకాలిక రుణాల చెల్లింపులో పెద్ద రైతులు, చిన్న సన్నకారు రైతులు ఉన్నారు. అయితే సమాజంలో పలుకు బడి ఉండి, పదవుల్లో ఉన్న రైతులకు కాస్త సమయం ఇస్తున్నా అధికారులు సన్నకారు రైతుల ఇళ్లకు వెళ్లి ఇష్టారీతిన వ్యవహారిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గత పదేళ్లుగా లోన్ చెల్లించని వారిలో పెద్ద రైతులు ఉన్నా వారిపై దాడులకు పాల్పడటం లేదని తెలుస్తోంది. చిన్న, సన్నకారు రైతులపై బ్యాంకు అధికారులు తమ బలాన్ని ప్రయోగించి వేధింపులకు గురి చేస్తున్నారన్న పలువురు రైతులు వాపోతున్నారు. ఇలా రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని సంబంధిత అధికారులకు అడగ్గా వడ్డీలో 30 శాతం రాయితీ అందిస్తున్నామని చెప్పారు. అపరాధ వడ్డీ పూర్తిగా మాఫీ చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

తీసుకోని డబ్బు ఎలా కట్టాలి

బ్యాంకు నుంచి రూ.1.50 రుణం తీసుకున్నాను. కానీ రూ.ఆరు లక్షల తీసున్నట్లు అధికారులు చూపుతున్నారు. దీనికి వడ్డీతో కలిపి రూ.10లక్షలు చెల్లించాలంటూ నోటీస్ అందించారు. డబ్బులు లేనప్పుడు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇంట్లో ఆడవాళ్లు ఉన్న సమయంలోనే ఇంటి తలుపు తీసి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తున్నారు.

– హన్మండ్లు, రైతు, అంకోల్

ఇంటి ముందు కూర్చుంటున్నారు

బ్యాంకు సిబ్బంది ఇంటి ముందు కూర్చుంటే డబ్బులు ఎక్కడికెళ్లి తేవాలి. పదేళ్ల క్రితం మా నాన్న లోన్ తీసుకున్నాడు. అప్పటి నుంచి అగడకుండా ఒక్కసారిగా వచ్చి కట్టు అంటు బెదిరిస్తున్నారు. వెను వెంటనే డబ్బిచ్చే స్థాయిలో ఉంటే అప్పు చేయాల్సి వచ్చి ఉండేది కాదు కదా. పంట చేతికి వచ్చిన తర్వాత రికవరీకి వస్తే కాస్త వెసులు బాటుగా ఉంటుంది.

– శ్రీనివాస్ గౌడ్, రైతు సంగం

నోటిని నిర్లక్ష్యం చేస్తే అనేక సమస్యలు

- ఆరోగ్యవంతమైన చిగుళ్లతో అందమైన చిరునవ్వు
- నేడు వరల్డ్ ఓరల్ హెల్త్ డే



సాక్షి, కామారెడ్డి: నోరు మంచిదైతే ఊరు మంచిదంటరు. అందుకే నోరు జారొద్దని చెబుతుంటారు. నోటి మాటకు అంత విలువ ఉంటుంది. నోటి మాటే కాదు నోటిలోని పళ్లు కూడా అంతే విలువైనవని చెప్పాలి. పళ్ల సమస్య మొత్తం ఆరోగ్యంపైనా ప్రభావం చూపుతుందని వైద్యులు చెబుతున్నారు. 'వరల్డ్ ఓరల్ హెల్త్ డే' సందర్భంగా ప్రత్యేక కథనం.. నోటిలో ఏదైనా ఇన్‌ఫెక్షన్ ఉంటే, రక్తం ద్వారా బ్యాక్టీరియా అన్ని బాగాలకు చేరి ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని చెబుతున్నారు. ముఖ్యంగా చిగుళ్ల వ్యాధులు, పుప్పిపళ్లు సమస్యలను నిర్లక్ష్యం చేస్తే అవి చాలా రకాల ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. చిగుళ్ల నుంచి రక్తం రావడం, పుప్పి పళ్లు, ఊగేపళ్లు, దుర్వాసన, చిగుళ్లు జారిపోవడం, నోట్లో పొక్కులు రావడం వంటి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా దంత వైద్యున్ని సంప్రదించాల్సిందే. నిర్లక్ష్యం చేస్తే ఇతర సమస్యలకు దారితీయొచ్చు. నోటిని శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సమస్యలు తలెత్తకుండా చూసుకోవచ్చు.

నోటిని నిర్లక్ష్యం చేయొద్దు



నోరు, పళ్లు, చిగుళ్ల ఆరోగ్యంగా ఉండాల్సిందే. ఏ ఒక్క సమస్య తలెత్తినా ఇతర అవయవాలపైనా ప్రభావం పడుతుంది. ప్రతీనిత్యం రెండు సార్లు రెండు నిమిషాల పాటు బ్రష్ చేసుకోవాలి. తిన్న ప్రతీసారి నోటిని పుక్కిలించాలి.ఏ డాదికో సారి తప్పనిసరి దంతవైద్యున్ని కలిసి చెకప్ చేయించుకోవాలి. ఏది తిన్నా రెండు వైపులా నమలాలి.

– ఎం మల్లికార్జున్, డెంటల్ సర్జన్

మోతె వీడీసీపై పోలీసులకు ఫిర్యాదు



ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు

వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె గ్రామ వీడీసీపై బాల్కొండ నియోజకవర్గ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఆదివారం ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, వేల్పూర్ ఎస్సై వినయ్ కుమార్ ఫిర్యాదు చేశారు. మోతె గ్రామం మీదుగా వెళ్తున్న తమకు ఎస్సీలు, గ్రామస్తుల మధ్య జరుగుతున్న వివాదం కనిపించిందని, దానిని చిత్రీకరిస్తుండగా వీడీసీ సభ్యులు, గ్రామస్తులు తమపై దాడిచేసి ఫోన్లు ధ్వంసం చేశారన్నారు. వారి దాడిలో గాయాలయ్యాయన్నారు. వారితో వాగ్వాదానికి దిగలేక ప్రాణరక్షణకు పారిపోయామన్నారు. తమపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆత్మీయ సమ్మేళనం




లింగంపేట: శ్రీ సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థులు, ఆచార్యుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం లింగంపేటలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ అధ్యక్షుడు కొత్త దుర్గయ్య మాట్లాడారు. శ్రీ సరస్వతి శిశు మందిర్ ఏర్పాటు చేసి 29 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించామన్నారు. లింగంపేట శిశు మందిర్‌ను అభివృద్ధి చేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఆచార్యులను సన్మానించారు. వక్త హరిస్మరణ్‌రెడ్డి, ప్రముఖ్ పక్కి శ్రీనివాస్, రాజిరెడ్డి, సత్యప్రసాద్, లక్ష్మీనారాయణ, చందు, పెద్ది శివ్వయ్య పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం

మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. పలు గ్రామాల్లో పంటలు నేలకు ఒరిగాయి. నష్టపోయిన పంటలను అధికారులు పరిశీలించారు.



రేకులపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



మోస్రా శివారులో..

నందిపేట: నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లో మొక్కజొన్న పంటకు అపార నష్టం జరిగింది. ఈదురు గాలులు, వడగండ్ల వానతో సుమారు 200 ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. డోంకేశ్వర మండలంలోని నూత్‌పల్లిలో శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం ధ్వజస్తంభం విరిగిపడిపోయింది. ఆయిల్‌ఫాం సాగులో అంతరపంటగా వేసిన కోత వచ్చిన మొక్కజొన్న పంట నేలవాలింది. పలు గ్రామాల్లో వరిపైరు అడ్డంగా పడిపోయింది.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లిలో వడగండ్ల వానతో నష్టపోయిన పంటను ఆదివారం మండల వ్యవసాయ అధికారి సిద్ధిరామేశ్వర్ పరిశీలించారు. శనివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో 200 నుంచి 300 ఎకరాల్లో వరిపంట 30 శాతం మేర నష్టం జరిగిందని సొసైటీ డైరెక్టర్ సుమన్, మాజీ ఎంపీటీసీ సాయిలు, రవిగౌడ్, రైతులు వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

రుద్రూర్: మోస్రా మండల శివారులో కురిసిన అకాల వర్షంతో వరి పొలాలు దెబ్బతిన్నాయి. ఆదివారం మోస్రా శివారులో వ్యవసాయాధికారి నగేష్‌రెడ్డి దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు.

ధర్పల్లి: మండలంలోని దుబ్బాక, రేకులపల్లి గ్రామాల్లో వర్షానికి వరి పంట దెబ్బతిన్నది. వడగండ్ల వానతో వరి గింజలు నేలరాలాయి. ధర్పల్లి మండల శివారు రేకులపల్లి, భీంగల్ మండల శివారు గోనుగోప్పుల, సికింద్రాపూర్ ప్రాంతపు శివారులో వడగండ్ల వాన ప్రభావం ఎక్కువగా ఉంది. దుబ్బార, రేకులపల్లి గ్రామాల్లో 250 ఎకరాలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. మరో 40 ఎకరాలో మామిడి పంటకు నష్టం వాటిల్లిందదని మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ తెలిపారు.



దుబ్బాక గ్రామంలో..

ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగుపాటు



చిన్న తడ్గూర్‌లో పిడుగు పడిన ట్రాన్స్‌ఫార్మర్

మద్నూర్: మండలంలోని చిన్న తడ్గూర్ శివారులోని మిషన్ భగీరథకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌పై ఆదివారం పిడుగు పడిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో ఉన్న మిషన్ భగీరథ సంపుకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌పై పిడుగు పడడంతో కాలిపోయింది.

క్రైం కార్నర్

రెండు బైకులు ఢీ : ఒకరి మృతి



భూమన్న మృతదేహం

మాక్లూర్: మండలంలోని బొంకన్‌పల్లి శివారులో సాయిబాబా ఆలయం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. బొంకన్‌పల్లికి చెందిన ఎం భూమన్న(51) తన టీవీఎస్ ఎక్సెల్‌పై మాదాపూర్ వెళ్తున్నాడు. మాదాపూర్ వైపు నుంచి తాపీ మేస్త్రీలు బైక్‌పై బొంకన్‌పల్లి వైపు వెళ్తున్నారు. సాయిబాబా ఆలయం మలుపు వద్ద వీరి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎక్సెల్‌పై ఉన్న భూమన్న అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్ ఉన్న మేస్త్రీలకు స్వల్ప గాయాలయ్యాయి. భూమన్నకు భార్య పద్మ, కుమారుడు శ్రీకాంత్, కుమార్తె శ్రీలత ఉన్నారు. పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు..

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్ తెలిపారు. జంగంపల్లి శివారులో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధురాలు చనిపోయింది. ఆమె శరీరం మొత్తం నుజ్జునుజ్జు అయ్యింది. సదరు మహిళకు మతి స్థిమితం లేనట్లుగా భావిస్తున్నారు.

నీటిసంపులో పడి చిన్నారి మృతి



నడ్కుడ యశ్(ఫైల్)

నందిపేట: నందిపేటలోని సుభాష్‌నగర్ మంథెన గల్లీలో ఆదివారం నీటి సంపులో పడి చిన్నారి మృతి చెందాడు. ఘటనకు సంబంధించిన వివరాలు.. నడ్కుడ శ్రీనివాస్, మమత దంపతులకు ఇద్దరు పిల్లలు. శ్రీనివాస్ బతుకు దెరువు కోసం గల్ఫ్ వెళ్లాడు. మమత బీడీలు చేస్తూ జీవిస్తోంది. రోజూ మాదిరిగానే మమత బీడీలను కంపెనీకి ఇచ్చేందుకు వెళ్లగా తన ఇద్దరు పిల్లలు ఇంటి వద్ద ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో చిన్న కుమారుడు యశ్(ఏడాదిన్నర) ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నల్లా సంపులో పడి మృతిచెందాడు. ఆలస్యంగా గమనించిన తల్లి స్థానికుల సహాయంతో చిన్నారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించింది. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు.

రాణంపల్లి శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

రుద్రూర్:రుద్రూర్ మండలం రాణంపల్లి శివారులో గుర్తు తెలియని మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. సులేమాన్‌నగర్– రాణంపల్లి ప్రధాన రోడ్డు పక్కన గానుగ చెట్టు కింద పురుగులు పట్టి ఉన్న మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి ఒంటిపై బ్లూ కలర్ జీన్ ప్యాంటు, ఆరెంజ్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్టు ఉంది. రాణంపల్లి వీఆర్‌ఏ కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): రోడ్డు మరమ్మతుల్లో భాగంగా వేసిన కంకరపై వెళ్తున్న కారు అదుపు తప్పి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొంది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్‌కు చెందిన వారు కారులో ఆదివారం మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని మిర్జాపల్లికి వచ్చారు. తిరిగి ఆర్మూర్ వెళ్తుండగా మిర్జాపల్లి తండా రోడ్డు పక్కన ఉన్న బ్రిడ్జి వద్ద కారు అదుపు తప్పి నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న వారు గాయపడ్డారు.

విదేశాలకు వెళ్లలేనేమోనని విద్యార్థి బలవన్మరణం



రవీందర్ మృతదేహం

బాల్కొండ: విదేశాలకు వెళ్లేందుకు ఐఎల్స్ రాసిన విద్యార్థి అందులో ఫెయిల్ కావడంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెండోరా మండల కేంద్రంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మెండోరా ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మెండోరా మండల కేంద్రానికి చెందిన నోముల రవీందర్(24)అమెరికా వెళ్లేందుకు ఇటీవల ఐఎల్స్ పరీక్ష రాశాడు. కానీ అందులో ఫెయిల్ అయ్యాడు. తోటి స్నేహితులు పాస్ అయి విదేశాలకు వెళ్లారు. దీంతో తాను ఇక విదేశాలకు వెళ్లలేనేమో అనే భావనతో జీవితంపై విరక్తి చెంది శనివారం అర్ధరాత్రి ఇంట్లో వరండాలోని ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కామారెడ్డి క్రైం: బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన చింతల పవన్ కల్యాణ్ (25) వీడియో గ్రాఫర్‌గా పని చేస్తున్నాడు. దేవునిపల్లిలో పనులు ముగించుకుని శనివారం రాత్రి 2 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వెళ్తుండగా ప్రధాన రహదారిపై మరో వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

పూజలు చేస్తే బంగారం వస్తుందని మోసం

- రూ.3.45 లక్షలు వసూలు చేసి టోకరా వేసిన నిందితులు

బాన్సువాడటౌన్: మీ ఇంట్లో పూజలు చేస్తే బంగారం బయటకు వస్తుందని నమ్మించి రూ.3.45 లక్షలు వసూలు చేసి మోసం చేసిన ఘటన బాన్సువాడలో చోటు చేసుకుంది. బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని గాంధీచౌక్‌లో నివాసముంటున్న హజరాబేగంకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హజరాబేగం మూడో కుమారుడు సయ్యద్ అబ్దుల్ రహమాన్(మున్నా) ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మున్నా స్నేహితులైన జావిద్, సోహేల్, లతీఫ్ చాలా సార్లు మున్నా ఇంటికి వచ్చే వారు. మీ ఇంట్లో బంగారం ఉంది.. పూజలు చేస్తే బయటకు వస్తుందని హజరాబేగంను నమ్మించారు. పూజలు చేయడానికి ఖర్చు అవుతుందని, జనవరిలో రూ.25 వేలు తీసుకున్నారు. డబ్బులు తీసుకుని మున్నాతో పాటు సోమేశ్వర్ గుట్టపై ఉన్న దర్గా వద్దకు వెళ్లి పూజలు చేశారు. కాళిమాత వచ్చిందని, తర్వాత రోజు ఐదు కోళ్లు కోయాలని చెప్పడంతో బాధితురాలు రూ.25 వేలు ఇచ్చింది. అనంతరం జావిద్, సోహేల్, లతీఫ్ తర్వాత బాధితురాలి ఇంటికి వెళ్లి కొత్త సూట్‌కేస్ తీసుకుని రావాలని చెప్పారు. సూట్‌కేస్ తీసుకురాగానే అందులో బంగారం చూపిస్తామని చెప్పి లైట్లు ఆర్పివేసి క్యాండిల్స్ వెలుగులో పూజలు చేశారు. తాము మళ్లీ వచ్చే వరకు సూట్‌కేసులను చూడవద్దని చెప్పి అప్పటి నుంచి పలు విడతల్లో మొత్తం రూ.3.45 లక్షలు వసూలు చేశారు. వారు సూట్‌కేసులను తెరవకపోవడంతో అనుమానం వచ్చి హజరాబేగం శనివారం రాత్రి తెరిచి చూడగా అందులో కుండ, పచ్చబట్ట, నిమ్మకాయ, బియ్యం ఉన్నాయి. దీంతో మోసపోయానని గ్రహించి హజరాబేగం పోలీసులను ఆశ్రయించింది. తనను మోసం చేసిన జావిద్, సోహేల్, లతీఫ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

చికిత్స పొందుతూ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ మృతి



కొంగ రమేష్(ఫైల్)

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ హైద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డిలో ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ కొంగ రమేష్ (45) నెల రోజుల క్రితం విధుల్లో భాగంగా కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి, పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నెల రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

యువతి అదృశ్యం

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన ఓ యువతి ఈ నెల 14 నుంచి కనబటం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. యువతిని నిజామాబాద్‌కు చెందిన శ్రీకాంత్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం పెళ్లి చేశారు. ఆరు నెలలకే ఆమె పుట్టింటికి వచ్చి తల్లిదండ్రులతో ఉంటుంది. ఈ నెల 14న ఇంట్లో నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.